# అనంతలో పవన్ ప్రభంజనం..



కదిలిన సేన.. వేలాదిగా యువత

ఆర్ట్స్ కళాశాల నుండి బైక్ ర్యాలీగా కదం తొక్కిన జనసైనికులు

అనంత కన్వెన్షన్ హాలులో డిప్యూటీ సీఎం పవన్ జన్మదిన వేడుకలు





**అనంతపురం, సెప్టెంబర్ 2 అనంత సూర్య :**

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు అనంతపురం జిల్లా కేంద్రంలో అత్యంత వైభవంగా, పండుగ వాతావరణంలో జరిగాయి. జనసేన శ్రేణులు, వీర మహిళలు, భారీ సంఖ్యలో తరలివచ్చిన యువతతో నగర వీధులు జనసంద్రంగా మారాయి. జనసేన శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావడంతో నగరంలో పండుగ వాతావరణం నెలకొంది. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువత ఉత్సాహంగా పాల్గొని తమ అభిమాన నేతకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని జనసేన నాయకులు భారీ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల నుంచి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. వందలాది ద్విచక్ర వాహనాలతో జనసైనికులు ర్యాలీగా నగరంలోని ప్రధాన వీధుల మీదుగా కదిలారు. పార్టీ జెండాలు చేతబూని, పవన్ కళ్యాణ్ చిత్రాలతో కూడిన ప్లకార్డులు ప్రదర్శిస్తూ అభిమానులు సందడి చేశారు. ర్యాలీలో ఉమ్మడి జిల్లా అధ్యక్షులు టీసీ వరుణ్, రాష్ట్ర కార్యక్రమాల కమిటీ ప్రధాన కార్యదర్శి భవాని రవికుమార్, రాయలసీమ రీజినల్ ఉమెన్ కోఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీ జయరాం రెడ్డి, అంకె ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

### కదిలిన సేన.. హోరెత్తిన నినాదాలు

జిల్లా కేంద్రంలోని చారిత్రాత్మక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల మైదానం నుంచి జనసైనికులు, నాయకులు చేపట్టిన భారీ బైక్ ర్యాలీ ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమైంది. అనంతపురంలోని ప్రధాన వీధుల గుండా సాగిన ఈ ర్యాలీలో యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు. 'జై పవన్ కళ్యాణ్.. జైజై జనసేన' అంటూ కార్యకర్తలు చేసిన నినాదాలతో అనంత వీధులు మార్మోగాయి. ర్యాలీ సాగిన దారి పొడవునా పవన్ కళ్యాణ్ చిత్రపటాలతో అభిమానులు సందడి చేశారు.

### అనంత కన్వెన్షన్ హాలులో ఘన సంబరాలు

అనంత కన్వెన్షన్ హాలులో నిర్వహించిన ప్రధాన జన్మదిన వేడుకలకు జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చారు. సభా ప్రాంగణం జనసేన జెండాలతో మారింది. బైక్ ర్యాలీ అనంతరం అనంత కన్వెన్షన్ హాలులో ప్రధాన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు కార్యకర్తలు ఉత్సాహంగా భారీ కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం జనసేన శ్రేణులు మరింత ఉత్సాహంతో పని చేస్తాయన్నారు. యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్న పవన్ కళ్యాణ్ ప్రజా జీవితంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం 'జై కొట్టు' లోగోను ఆవిష్కరించారు.

### యువతలో ఉరకలేసిన ఉత్సాహం

జన్మదిన వేడుకల సందర్భంగా నగరంలో ఎక్కడ చూసినా జనసేన జెండాలు, పవన్ కళ్యాణ్ చిత్రాలు, అభిమానుల సందడి కనిపించింది. బైక్ ర్యాలీ నుంచి ప్రధాన వేడుకల వరకు యువత భారీగా పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అభిమానుల ఉత్సాహంతో అనంతపురం నగరం జనసేన నినాదాలతో మార్మోగింది.

# వైఎస్ఆర్ ఆశయాలను కొనసాగిస్తాం

- నాటి జలయజ్ఞం ఫలితాలతోనే నేడు అన్ని ప్రాంతాలకు నీరు
- ఉమ్మడి ఏపీలో 1.33 లక్షల కోట్లతో 86 సాగునీటి ప్రాజెక్టులు
- ఐదేళ్ల వైఎస్ఆర్ పాలనలోనే 20 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరు
- నాడు జలయజ్ఞాన్ని ధనయజ్ఞం అంటూ విమర్శించిన చంద్రబాబు
- నేడు సాగునీటి ప్రాజెక్టుల ఘనత తనదేనంటూ బాబు క్రెడిట్ చోరీ
- సంక్షేమ పథకాలతో పేదల పెన్నిధిగా వైఎస్ రాజశేఖరరెడ్డి
- వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి
- అనంతపురంలో మహానేత వైఎస్ఆర్‌కు ఘన నివాళి
- సేవా కార్యక్రమాలు చేపట్టిన వైఎస్ఆర్‌సీపీ శ్రేణులు



**అనంతపురం, సెప్టెంబర్ 2 అనంత సూర్య :**

మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాలను కొనసాగిస్తామని వైఎస్ఆర్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. వైఎస్ చేపట్టిన జలయజ్ఞం ఫలితాలతోనే నేడు అన్ని ప్రాంతాలకు గోదావరి, కృష్ణా జలాలు చేరుతున్నాయని కొనియాడారు. బుధవారం వైఎస్ఆర్ 17వ వర్ధంతి పురస్కరించుకుని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో కలిసి అనంతపురంలోని వైసీపీ జిల్లా కార్యాలయం, జెడ్పీ ఆవరణలోని వైఎస్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి పేదల పెన్నిధి అని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 'మహాప్రస్థానం' పేరుతో సుదీర్ఘ పాదయాత్ర చేసి ప్రజల కష్టాలను నేరుగా తెలుసుకున్నారని గుర్తు చేశారు. 2004లో ముఖ్యమంత్రి కాగానే తొలి సంతకం ఉచిత విద్యుత్ ఫైల్‌పై పెట్టి రైతు పక్షపాతిగా నిలిచారని తెలిపారు. ఐదేళ్ల తన పాలనలో అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చి ప్రజల జీవితాలను మార్చారని తెలిపారు. రాజకీయాలు, కుల, మతాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు అందించిన సంక్షేమ ప్రదాన వైఎస్ఆర్ అని కొనియాడారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉచిత విద్యుత్, రుణమాఫీ వంటి పథకాలతో ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని తెలిపారు.

### రూ.1.33 లక్షల కోట్లతో సాగునీటి ప్రాజెక్టులు

గోదావరి, కృష్ణా జలాలను ప్రతి ఎకరాకు అందించేలా రూ.1.33 లక్షల కోట్లతో జలయజ్ఞం ద్వారా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 86 సాగునీటి ప్రాజెక్టులను చేపట్టిన ఘనత వైఎస్ రాజశేఖరరెడ్డికే దక్కుతుందని అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. ఐదేళ్ల వైఎస్ పాలనలో 16 ప్రాజెక్టులు పూర్తిగా.. మరో 26 ప్రాజెక్టులను పాక్షికంగా పూర్తి చేశారని గుర్తు చేశారు. తద్వారా ఆ ఐదేళ్లలోనే 20 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరందించడమే కాకుండా 4 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించినట్లు తెలిపారు. నాటి జలయజ్ఞం కారణంగానే నేడు అన్ని ప్రాంతాలకు గోదావరి, కృష్ణా జలాలు వస్తున్నాయన్నారు. "గతంలో వైఎస్ఆర్ ఉచిత విద్యుత్ ఇస్తానంటే కరెంట్ తీగలపై బట్టలు ఆరేసుకోవాల్సి వస్తుందని చంద్రబాబు అన్నారు. జలయజ్ఞం అంటే ధనయజ్ఞం అని విమర్శించారు. అసలు వ్యవసాయమే దండగ అని చెప్పిన వ్యక్తి చంద్రబాబు. అలాంటి వ్యక్తి ఈరోజు జలయజ్ఞం కారణంగా అందుతున్న ఫలితాల ను మాత్రం తన ఖాతాలోకి వేసుకుంటున్నాడు" అని అనంత విమర్శించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి చేపట్టిన జలయజ్ఞంను ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనలో ముందుకు తీసుకెళ్లారని తెలిపారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని, వైఎస్ఆర్ ఆశయాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

### వైఎస్ఆర్‌సీపీ శ్రేణుల సేవా కార్యక్రమాలు

వైఎస్ఆర్ 17వ వర్ధంతి సందర్భంగా వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో అనంతపురంలో సేవా కార్యక్రమాలు కొనసాగాయి. ప్రభుత్వ సర్వజనాస్పత్రి వద్ద అన్నదానం చేశారు. బీసీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో సర్వజనాస్పత్రిలో వైద్య చికిత్సల కోసం పరికరాలు అందించారు. వైసీపీ యువజన విభాగం అనంత జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ ఆధ్వర్యంలో రంగస్వామి నగర్‌లోని స్పందన అనాధ ఆశ్రమంలో అన్నదానం చేశారు. లారీ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తపోవనంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.





# ప్రభుత్వ ఆస్పత్రికి వైద్య పరికరాల వితరణ



దివంగత మహానేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా సేవా కార్యక్రమాల్లో భాగంగా అత్యవసర వైద్య పరికరాలను వితరణ చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి చేతుల మీదుగా ఆసుపత్రికి పియర్‌బయో ఆప్టిమా పోర్టబుల్ సక్షన్ మెషిన్‌ను అందజేశారు. అత్యవసర పరిస్థితుల్లో రోగుల శ్వాస మార్గాల్లో పేరుకుపోయిన ద్రవాలను తొలగించి, వారు సులభంగా శ్వాస తీసుకునేందుకు సహాయపడే ఈ పోర్టబుల్ సక్షన్ మెషిన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వారు తెలిపారు. వైసీపీ బీసీ సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రజా సేవా కార్యక్రమాలను నిర్వహించడం స్ఫూర్తిదాయకమని వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి అ న్నారు. రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. వైఎస్సార్ 17వ వర్ధంతి సందర్భంగా ప్రతి సంవత్సరం ప్రజలకు ఉపయోగపడే విధంగా వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. వైఎస్సార్ ఆశయాలను, ఆయన ప్రజా సంక్షేమ పాలన స్ఫూర్తిని వైఎస్.జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ, మాజీ టీటీడీ బోర్డు నెంబర్ అశ్వార్థ నాయక్, మాజీ రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, పంచాయతీ రాజ్ రాష్ట్ర అధ్యక్షులు వెన్న పూస రవీంద్ర రెడ్డి, నగర అధ్యక్షులు చింత సోమశేఖరరెడ్డి, మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్ రిజ్వన్, మాజీ డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, బూత్ కమిటీ జిల్లా అధ్యక్షులు ఎద్దుల అమర్‌నాథ్‌రెడ్డి, మైనార్టీ జిల్లా అధ్యక్షులు సైపుల్లాబేగ్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షులు శ్రీదేవి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# అరుణోదయ కాలనీలో స్ట్రీట్ కార్నర్ మీటింగ్



**అనంతపురం, సెప్టెంబర్ 2 అనంతసూర్య :**

జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు వివిధ అంశాలపై త్రీటౌన్ పోలీసులు అవగాహన కల్పించారు. మహిళలు, పిల్లల భద్రతకు జిల్లా పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యమిస్తోందని, నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అనంతపురం త్రీటౌన్ సీఐ కౌలుట్లయ్య పిలుపునిచ్చారు. ఎస్పీ ఉత్తర్వుల మేరకు బుధవారం త్రీటౌన్ సబ్ ఇన్‌స్పెక్టర్, సిబ్బందితో కలిసి అరుణోదయ కాలనీలో స్ట్రీట్ కార్నర్ మీటింగ్ నిర్వహించారు.

ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. మహిళలపై జరుగుతున్న నేరాలు, బాల్య వివాహాల నిర్మూలన, పోక్సో చట్టంపై కాలనీవాసులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ఉండాలంటే అపరిచిత వ్యక్తులకు ఓటీపీలు, బ్యాంక్ వివరాలు చెప్పకూడదని హెచ్చరించారు. అత్యవసర సమయాల్లో మహిళల రక్షణ కోసం రూపొందించిన 'శక్తి' యాప్‌ను ప్రతి ఒక్కరూ తమ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన నేర చట్టాల (న్యూ క్రిమినల్ లాస్) గురించి ప్రజలకు వివరించారు. ఏదైనా ఆపద లేదా సమస్య ఎదురైతే వెంటనే 'డయల్ 100/112'కు ఫోన్ చేసి సమాచారం అందించాలని, పోలీస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో త్రీటౌన్ ఎస్ఐ, పోలీస్ సిబ్బంది, అరుణోదయ కాలనీ వాసులు పాల్గొన్నారు.

# వినాయక మండపానికి భూమిపూజ చేసిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



**అనంతపురం, సెప్టెంబర్ 2 అనంతసూర్య :**

నగరంలోని 4వ రోడ్డు శాంతి నగర్ సర్కిల్ వద్ద వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేయనున్న వినాయక మండపానికి అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ భూమి పూజ నిర్వహించారు. ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి, వడ్డెర కుల సంఘాల నాయకులు, బోర్‌వెల్ అషోసియేషన్ సభ్యులు, స్థానికులతో కలిసి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ.. గత 25 సంవత్సరాలుగా బోర్ వెల్ అసోసియేషన్ సభ్యులు, వడ్డెర సోదరులందరూ ఐకమత్యంతో వినాయక చవితి వేడుకలను నిర్వహిస్తూ వస్తుండటం ఎంతో ఆనందదాయకమన్నారు. భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్న ఈ వేడుకలు ప్రజల్లో ఆధ్యాత్మికతతో పాటు ఐక్యతా భావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. వినాయక చవితి ఉత్సవాలను ప్రతి సంవత్సరం విజయవంతంగా నిర్వహిస్తున్న వడ్డెర సంఘాల నాయకులు, యువతను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అభినందించారు. కార్యక్రమంలో బోర్‌వెల్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు దలవాయి వెంకటనారాయణ, అధ్యక్షుడు కదిరప్ప, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీని కలిసిన సీపీఓ బాలోజీ నాయక్



**అనంతపురం, సెప్టెంబర్ 2 అనంత సూర్య :**

అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీ నారాయణను తన క్యాంపు కార్యాలయంలో నూతన సీపీఓ బాలోజీ నాయక్ మర్యాద పూర్వ కంగా కలిశారు. ఎంపీ నిధులు, ఇతర వర్క్‌లో పురోగతి, త్వరితగతిన చేపట్టడానికి తగిన సూచనలను ఎంపీ అధికారులకు తెలియజేశారు. ప్రజలకు ప్రభుత్వం ఇచ్చిన పనులను పరదర్శకంగా త్వరగా నిర్వహించాలని, సరైన సమయంలో పనులు పూర్తి చేస్తే ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. సంబంధిత వర్క్ సంబంధించిన ఇంజనీర్లు కూడా ప్రజలను దృష్టిలో పెట్టుకొని పనులను పూర్తిస్థాయిలో క్వాలిటీ, పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. సమావేశంలో చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్, సిబ్బంది పాల్గొన్నారు.

# గురుపూజోత్సవ వేడుకలను విజయవంతం చేద్దాం





**అనంతపురం, సెప్టెంబర్ 2 అనంత సూర్య :**

భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని గురుపూజోత్సవ వేడుకలను ఈనెల 4వ తేదీన ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు-2026 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ సంస్థ వ్యవస్థాపకులు సుంకర రమేష్ తెలిపారు. బుధవారం కార్యక్రమ ఆహ్వాన పత్రికలను అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్, జిల్లా విద్యాధికారి డాక్టర్ అయుబ్ హుస్సేన్, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పద్మశ్రీలకు అందజేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు సంబంధించి వివిధ విద్యాసంస్థల్లో వృత్తి నిర్వహిస్తూ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను గుర్తించి వారిని గౌరవిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లాలోని గురువులు, సాహితీవేతలు, సామాజిక కార్యకర్తలు, విద్యావంతులు, మేధావులు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# కలిసికట్టుగా వైఎస్ఆర్‌సీపీని బలోపేతం చేద్దాం

## వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్



**అనంతపురం, సెప్టెంబర్ 2 అనంత సూర్య :**

అందరూ కలిసికట్టుగా పని చేసి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేద్దామని వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ అన్నారు. బుధవారం నగరంలోని రజకనగర్‌లో 43 నుంచి 48 డివిజన్ల పరిధిలో ఉన్న 60, 62 నుంచి 70 సచివాలయాల యువజన విభాగం నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్ జగన్ సీఎంగా ఉన్న సమయంలో అర్హతే ప్రామాణికంగా ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించామని తెలిపారు. కూటమి పార్టీలు అపద్ధపు హామీలతో గద్దెనెక్కి ప్రజలను మోసం చేశాయన్నారు. గతంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను అటకెక్కించారని విమర్శించారు. రెండేళ్లు దాటినా నిరుద్యోగ భృతి అమలు చేయలేని అసమర్థ ముఖ్యమంత్రి చంద్రబాబు అని మండిపడ్డారు. యువత, విద్యార్థులు, మహిళలను వెన్నుపోటు పొడిచారన్నారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వ వైఫల్యాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని సూచించారు. రెండేళ్లుగా కూటమి నేతలు ప్రచార ఆర్భాటానికే పరిమితం అవుతున్నారని విమర్శించారు. పార్టీలో కష్టపడిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైసీపీ జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షులు ఎం.శ్రీనివాసులు, నగర ఉపాధ్యక్షులు ఇషాక్, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి హరి, మహిళ విభాగం జిల్లా ఉపాధ్యక్షులు ప్రసన్న లక్ష్మి, యూత్ డివిజన్ అధ్యక్షులు వినోద్ కుమార్, డివిజన్ అధ్యక్షులు ప్రదీప్, మాలపాటి వెంకటేష్ సీనియర్ నాయకులు, బీసీ సెల్ నగర సెక్రటరీ మధు, మాజీ కార్పొరేటర్ టీవీ చంద్రమోహనరెడ్డి, రవికుమార్ యవజన జిల్లా ఉపాధ్యక్షుడు, 46 డివిజన్ యూత్ వింగ్ షెక్షావలి, అరవింద్, నారాయణరెడ్డి, రసూల్, రామచంద్ర, 43 డివిజన్ కిషోర్, ధను, యూత్ నగర ఉపాధ్యక్షులు వినీత్ ఉదయ కుమార్, మాసూద్, నగర కార్యదర్శి మైనుద్దీన్, యూత్ వింగ్ టౌన్ జనరల్ సెక్రెటరీ సాకే శ్రీనివాసులు, ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు, యువజన విభాగం కమిటీ మెంబర్స్ పాల్గొన్నారు.



# పవనిజం.. జై కొట్టు

## 300 మందితో బైక్ ర్యాలీ చేసిన సాయికృష్ణ యాదవ్

**అనంతపురం, సెప్టెంబర్ 2 అనంత సూర్య :**

తమ అధినేత, జనసేనాని, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా.. అనంతపురం ఆర్ట్స్ కళాశాల నుంచి జరిగిన బైక్ ర్యాలీకి సాయికృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో 300 మంది యువత స్వచ్ఛందంగా పవన్ కళ్యాణ్ అభిమానులు, జనసేన కార్యకర్తలు వచ్చి ర్యాలీలో పాల్గొన్నారు. సాయి అన్న.. 'జై కొట్టు' పవన్ కళ్యాణ్‌కు అంటూ కార్యకర్తలు చేసిన నినాదాలు మార్మోగాయి. అనంతరం బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్న పవన్ కళ్యాణ్ ప్రజా జీవితంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం 'జై కొట్టు' లోగోను ఆవిష్కరించారు.

Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405